

ఉత్తిపోతలు

- నారాయణపేట జిల్లాలో దశాబ్దకాలంగా పని చేయని ఎత్తిపోతల పథకాలు
- మెట్ట పంటల సాగుకే పరిమితమైన ఆయకట్టు రైతులు
- మరమ్మతులు చేసి.. వినియోగంలోకి తేవాలని విన్నపాలు



మూతపడ్డ పస్పుల ఎత్తిపోతల పథకం

మక్తల్, మార్చి 18: నారాయణపేట జిల్లాలోని పలు ఎత్తిపోతల పథకాలు పని చేయకపోవడంతో రైతులు పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఆయకట్టులో వర్షాధారంగా పంటలు సాగు చేస్తూ, అప్పులపాలవుతున్నారు. మక్తల్ మండలంలోని కొండదొడ్డి, ముస్లాయిపల్లి, పస్పుల, కృష్ణ మండలంలోని ముడుమాల్ ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. మోటార్లు మరమ్మతులకు నోచుకోకపోవడం, కాల్వల్లో పూడిక పేరుకుపోవడం, నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

కొండెక్కిన కొండదొడ్డి

మక్తల్ మండలంలోని కొండదొడ్డి ఎత్తిపోతల పథకాన్ని 16 ఏళ్ల క్రితం రూ.2,63,52,000 ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. దీని ద్వారా కొండదొడ్డి, ఎల్లపంల్లి, అప్పన్నపల్లి, పెద్దకడ్మూర్ గ్రామాలకు చెందిన రైతుల 1,500 ఎకరాలకు నీరందించేందుకు నిర్ణయించారు. 215 హెచ్‌పీ మోటార్లు మూడు బిగించారు. నాలుగేళ్లు బాగానే పని చేసినా.. అనంతరం అలనా పాలనా లేకపోవడంతో మోటార్లు కాలిపోయాయి. కాల్వల్లో పూడిక పెరిగింది. దీంతో కొండదొడ్డి ఎత్తిపోతల పథకం అటకెక్కింది. 12 ఏళ్ల నుంచి రైతులు వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు.

మూన్నాళ్ల ముచ్చటలా ముస్లాయిపల్లి

మక్తల్ మండలంలోని ముస్లాయిపల్లి ఎత్తిపోతల పథకాన్ని 1994లో రూ.55 లక్షల వ్యాయంతో ప్రారంభించారు. దాదన్‌పల్లి, ముస్లాయిపల్లి గ్రామాల్లోని 650 ఎకరాలకు నీరు అందించడంతోపాటు ఆయా గ్రామాల చెరువులనూ నింపేందుకు నిర్ణయించారు. అప్పట్లో విద్యుత్ సమస్య అధికంగా ఉన్నా.. ఈ ఎత్తిపోతల కోసం ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసి 16 గంటల విద్యుత్‌ను సరఫరా చేశారు. పదేళ్లపాటు ఈ పథకం బాగానే సాగినా.. అనంతరం పాలకులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. 14 ఏళ్ల నుంచి మూతపడినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు అంటున్నారు. దాంతో ఇక్కడా ఆయకట్టు రైతులు వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు.



పస్పుల ఎత్తిపోతల పథకం వద్ద కాలిపోయిన మోటార్లు



కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, ముళ్ల పొదలు

పస్పులదీ అదేతీరు

పస్పుల ఎత్తిపోతల పథకాన్ని 2006లో అప్పటి ఎమ్మెల్యే స్వర్ణాసుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. 4,200ల ఎకరాలకు నీరందించేలా డిజైన్ చేశారు. చిట్యాల, పస్పుల, పంచదేవ్‌పహడ్, పారేవుల, గోప్లాపూర్ గ్రామాలకు నీరందించాల్సి ఉంది. దీనికి 16 గంటలు విద్యుత్ అందించేందుకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేశారు. నాలుగేళ్లపాటు నడిచిన ఎత్తిపోతల పథకం.. 11 ఏళ్ల నుంచి మూతపడింది. కాల్వ మరమ్మతు చేపట్టకపోవడం, విద్యుత్ సమస్య అధికం కావడంతో పని చేయడం లేదు.

మూతపడ్డ ముడుమాల్

కృష్ణ మండల పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతాలైన సుకూర్‌లింగంపల్లి, కుసుముర్తి, తంగిడి, గుడెబల్లూర్, ముడుమాల్ తదితర గ్రామాల రైతులు వలస వెళ్లకుండా నది ఒడ్డున దివంగత ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి రూ.60 లక్షలతో ముడుమాల్ ఎత్తిపోతల పథకాన్ని 1987లో ప్రారంభించారు. దీని కింద 3,600 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఇది పని చేయడం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం మరమ్మతు కోసం రూ.1.54 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం పనులు చేస్తుండటంతో పథకం కింద రైతులు వరి సాగు చేయలేదు. ప్రస్తుతం వెయ్యి ఎకరాలకు మాత్రమే నీరందిస్తున్న ఈ పథకానికి కొత్త మోటార్లను బిగించి, చివరి ఆయకట్టువరకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

ఎత్తిపోతలు పునరుద్ధరించాలి



ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలి. ముస్లాయిపల్లి ఎత్తిపోతల పథకం పదేళ్ల నుంచి మూత పడటంతో పంటలు సాగు చేయలేకపోతున్నాం. ఎత్తిపోతల కింద మాకు ఆరు ఎకరాల భూమి ఉంది. భూములు సారవంతంగా లేకపోవడంతో వర్షాధార పంటలు సాగుచేసినా ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. పెట్టుబడులు సైతం అందక అప్పులపాలవుతున్నాం.

\- కుర్వ రాజు, ముస్లాయిపల్లి.

అప్పులపాలవుతున్నాం..



ఎత్తిపోతల పథకాలు మూతపడటంతో వర్షాధార పంటలు సాగు చేస్తూ, అప్పులపాలవుతున్నాం. కృష్ణానది చెంతనే పొలాలు ఉన్నా నీరందని పరిస్థితి ఏర్పడింది. కొండదొడ్డి ఎత్తిపోతల కింద గతంలో నా పది ఎకరాల భూమిలో వరి నాటేవాళ్లం. దశాబ్దకాలంగా ఎత్తిపోతల మూతపడటంతో సరైన పంటలు సాగుచేయలేక అప్పులపాలవుతున్నాం. ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించాలి.

\- మరటి నారాయణరెడ్డి, కొండదొడ్డి

రోజుకో మలుపు

- వనపర్తి మునిసిపాలిటీలో అవిశ్వాసం లేనట్లే..
- నేడు పదవులకు రాజీనామా చేయనున్న చైర్మన్, వైస్ చైర్మన్
- కొత్త పాలకులను ఎన్నుకునే అవకాశం బీఆర్‌ఎస్‌కే..
- నూతన చైర్మన్.. వైస్ చైర్మన్ రేసులో పుట్టపాకల, పాకనాటి



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

వనపర్తి టౌన్, మార్చి 18: వనపర్తి మునిసిపాలిటీలో ముదిరిన అవిశ్వాస తీర్మాన అంశం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టాలని ఇప్పటికే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి, ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ ఈనెల 27న అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయాలని 12న అధికారులకు, కౌన్సిల్ సభ్యులకు లేఖలు పంపించారు. వనపర్తి మునిసిపాలిటీ చరిత్రలో చైర్మన్, వైస్ చైర్మన్‌పై మొదటి సారిగా అవిశ్వాస తీర్మానం సమావేశం ఏర్పాటు కానుందని అందరూ ఊహించారు. కానీ తాజాగా మరో అంశం తెరపైకి వచ్చే సరికి.. అవిశ్వాసం వీగిపోనుందని తెలుస్తోంది.

పలు సమావేశాల అనంతరం..

వనపర్తి మునిసిపాలిటీలో అవిశ్వాస తీర్మాన సమావేశం లేకుండా చూడాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పలుమార్లు అసమ్మతి కౌన్సిలర్లతో సమావేశాలు నిర్వహించారు. అయినప్పటికీ బీఆర్‌ఎస్ కౌన్సిల్ సభ్యులు ససేమిరా అనడంతో.. అవిశ్వాసానికంటే ముందే చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌లతో తమ పదవులకు రాజీనామాలు చేయించబోతున్నారు. ఈనెల 19న వారు తమ పదవులకు రాజీనామా చేయనున్నారని తెలుస్తోంది. అదే గనుక జరిగి, రాజీనామాలు ఆమోదం పొందితే మునిసిపాలిటీలో అవిశ్వాసం లేనట్లే అవుతుంది. దీంతో నూతనంగా కాబోయే చైర్మన్, వైస్ చైర్మన్‌లను బీఆర్‌ఎస్ కౌన్సిలర్లే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. ఈ తరుణంలో కొత్త చైర్మన్‌గా 13వ వార్డుకు చెందిన యువ కౌన్సిలర్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్‌గా 20వ వార్డుకు చెందిన పాకనాటి కృష్ణ పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

ఆమోదం పొందితేనే..

అవిశ్వాసానికంటే ముందే తమ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధపడ్డ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై నమ్మకం కుదరని అసమ్మతి కౌన్సిలర్లు.. రాజీనామాలు ఆమోదం పొందితేనే ఈ నెల 28న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపు నిర్వహణకు వస్తామని, లేదంటే ప్రత్యేక క్యాంపులో పాల్గొంటామని తెగేసి చెబుతున్నారు. ఒకటి లేదా రెండు రోజులు ఆలస్యం అయినా ఫరవాలేదని, రాజీనామాలు ఆమోదం పొందాలని వారంటున్నారు. అప్పటి వరకు క్యాంపులో పాల్గొనబోమని నిరంజన్‌రెడ్డికి నిర్మొహమాటంగా చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. రాజీనామాలు ఆమోదం పొందకుండా.. సభ్యులను క్యాంపునకు తరలిస్తే తరువాత వారు వాటిని వాపస్ తీసుకోరనే గ్యారంటీ ఏంటని కొందరు కౌన్సిలర్లు బహిరంగంగానే తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు.

2/3 నిష్పత్తిలో సంఖ్యా బలం..

వనపర్తి మునిసిపాలిటీలో మొత్తం 33 వార్డులు ఉన్నాయి. అందులో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 25 మంది, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఐదుగురు, బీజేపీ కౌన్సిలర్లు ఇద్దరు, టీడీపీ కౌన్సిలర్ ఒకరు ఉన్నారు. వీరిలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆరువాత బీజేపీ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్ల సంఖ్య 23కు చేరింది. వీరిలో 14 మంది చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసాన్ని కోరుతున్నారు. దీంతో అవిశ్వాసానికి కావాల్సిన 2/3 నిష్పత్తి ప్రకారం.. 22 మంది ఓటు వేయాల్సి ఉంటుంది. ఈ లెక్కల ప్రకారం అవిశ్వాసానికి సిద్ధపడ్డ 14 మంది బీఆర్‌ఎస్, ఏడు మంది కాంగ్రెస్, ఒక టీడీపీ కౌనిలర్‌తో కలిపితే 2/3 నిష్పత్తిలో సంఖ్యా బలం 22కు చేరుతుంది. అవిశ్వాసానికి కావాల్సిసిన బలం చేకూరుతుంది.

ఆ ప్రచారంలో.. వాస్తవం లేదు

- శ్రీనివాస్ గౌడ్ బీజేపీలో చేరుతారనేది ప్రతిపక్షాల కుట్ర
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ
- నేటి నుంచి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్), మార్చి 18: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భారతీయ జనతా పార్టీలో చేరతారనే ప్రచారంలో వాస్తవం లేదని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ కొట్టిపడేశారు. ఇలాంటి ఫేక్ వార్తల వెనుక ప్రతిపక్షాల కుట్ర దాగుందని అన్నారు. సోమవారం ఆమె మహబూబ్‌నగర్‌లోని తన గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చినందున మంగళవారం నుంచే ఎన్నికల ప్రచారాన్ని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గల పార్లమెంట్ కేంద్రం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మంగళవారం జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి కార్యకర్తల సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో ఎన్నికల ప్రచార సమావేశాల తేదీలను ప్రకటిస్తానని చెప్పారు. ఈ విషయాన్ని మీడియాకు కూడా తెలియజేయనున్నట్లు చెప్పారు. పార్టీలో వరుసగా చేరికలు మొదలయ్యాయన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించిన ప్రధాన మంత్రి మోదీ సభ విజయవంతం అయ్యిందని అన్నారు. అందుకు తోడ్పడిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన బీజేపీని వీడి, కాంగ్రెస్ కండువా కప్పుకొని బీజేపీపై మాట్లాడిన తీరు ప్రజలు గుర్తించాలని కోరారు. చాలా మంది ముఖ్య నాయకులు బీజేపీని వీడడానికి కారణం జితేందర్ రెడ్డి అని అన్నారు. గతంలో ఆయన పార్టీని వీడను అని మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. నరేంద్ర మోదీ తిరిగి ప్రధాన మంత్రి కావడం తప్పనిసరి అని ప్రజల్లో చర్చ ప్రారంభమైందని, ఈ సునామీని ఎవరూ ఆపలేరని అన్నారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీట్లు గెలవడం పక్కా అని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు క్రిష్ణవర్ధన్ రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, అంజయ్య, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- నాగర్‌కర్నూల్ జిల్లా కొండనాగుల గ్రామంలో ఘటన

బల్మూరు, మార్చి 18 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉర్సునూరి నరసింహ(60) సోమవారం తన ఇంటి వద్ద బట్టలు ఉతికి జేవైరుపై ఆరవేసేందుకు ఉపక్రమించాడు. అప్పటికే ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే వైరు తెగి జేవైరుపై పడిపోయింది. గమనించని నరసింహ వైరుపై దుస్తులు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు జేవైరుకు విద్యుత్ సరఫరా కావడంతో ఆయన షాక్ తగిలి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్రతో వైర్లను జరిపి అతన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారులు పరీక్షించి, మృతి చెందినట్లు తెలిపారు. నరసింహ ప్రస్తుతం చెంచు సంఘం రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్‌గా, జిల్లా చెంచు సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. చెంచు సంఘాల నాయకుడు చనిపోవడంపై చెంచులు, సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతునికి భార్య బొజ్జమ్మతో పాటు, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.



పాలమూరులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు(ఫైల్)

పాలమూరులో.. ఐదు చెక్ పోస్టులు

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు
- ఇప్పటికే జిల్లాకు కేంద్ర బలగాలు
- రూ.50 వేల కన్నా అధికంగా నగదు తీసుకెళ్తే లెక్కచెప్పాలి

మహబూబ్‌నగర్, మార్చి18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. షెడ్యూల్ వెలువడం, అభ్యర్థులు ప్రచారాలకు సిద్ధమవుతుండటంతో ఎన్నికల నియమావళిని పాటించేందుకు పోలీస్‌శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో ఐదు ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి.. వాహనాల తనిఖీ చేయనుంది. అనుమానితుల వివరాలు సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రూ.50 వేల కన్నా అధికంగా నగదు సరఫరా చేస్తే అందుకు లెక్కలు చెప్పాల్సి ఉంటుంది. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలైన అడ్డాకుల, మిడ్జిల్, లాల్‌కోట ఎక్స్ రోడ్డు, నవాబ్‌పేట, కొల్లూరుతో పాటు మహబూబ్‌నగర్ పట్టణంలోని మయూరి నర్సరీ దగ్గర చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖ నిర్ణయించింది. ఒకటి రెండు రోజుల్లో వీటిని ఏర్పాటుచేయనున్నారు. ఒక్కో చెక్‌పోస్టు దగ్గర నలుగురు పోలీసులను బందోబస్తుకు ఉంచనున్నారు. నగదు, లిక్కర్ అక్రమంగా సరఫరా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు పోలీస్‌శాఖ సన్నద్ధమౌతోంది. నిత్యం డబ్బు రవాణా చేసే వ్యాపారులు ఇబ్బంది పడకుండా డబ్బు సరఫరా చేసే ఆయా వ్యాపార సంస్థల ఏజెంట్ల వివరాలను ముందుగానే పోలీసులకు అందజేయాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు. బంగారు దుకాణాలు, పెట్రోల్ బంక్‌లు, షాపింగ్ మాల్స్, మార్టల నుంచి ప్రతీ రోజు నగదు సరఫరా చేయడంతోపాటు బ్యాంక్‌లలో నగదు డిపాజిట్ చేయడం చేస్తుంటారు వీరి డిపాజిట్ వివరాలు, ఏజెంట్లకు సంబంధించిన వివరాలు తెలుపాలని పోలీసులు ఇప్పటికే వ్యాపారులకు సమాచారం ఇస్తున్నారు. రూ.50 వేల కన్నా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్తే.. అందుకు సంబంధించిన వివరాలను తమ వద్ద ఉంచుకోవాలి. సరైన ఆధారాలు, లెక్కలు సమర్పించని నగదును రోజూ సీజ్ చేస్తున్నారు. నగదును జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నియమించిన గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తారు. ఆధారాలుంటే వాటిని గ్రీవెన్స్ కమిటీకి సమర్పించి నగదును తీసుకెళ్ళాల్సి ఉంటుంది.

జిల్లాకు వస్తున్న కేంద్ర బలగాలు

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలు జిల్లాకు రానున్నాయి. ఇప్పటికే వంద మంది సభ్యులతో ఒక కంపెనీ(కేంద్ర సాయుధ బలగాలు) వారం క్రితమే జిల్లాకు వచ్చాయి. ఇప్పటికే పలు ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల్లో.. పోలీసులు ఉన్నారన్న భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఎ న్నికల్లో భయాలు లేకుండా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజలకు పోలీసులు అండగా ఉంటారని అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి మరో రెండు, మూడు కంపెనీల బలగాలు జిల్లాకు రానున్నాయి.

పది పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 99.56 శాతం విద్యార్థులు హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు



గద్వాలలోని సరస్వతీ పాఠశాల కేంద్రం వద్ద వేచి వున్న విద్యార్థులు

గద్వాల టౌన్, మార్చి 18 : జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 41 కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించిన తొలి రోజు పరీక్షకు మొత్తం 7,302 మంది విద్యార్థులకుగాను, 7,179 మంది (99.56 శాతం) హాజరయ్యారు. మిగతా 33 మంది పరీక్ష రాయలేదు. అధికారులు విధించిన నిబంధన మేరకు విద్యార్థులందరూ గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. వారిని అధికారులు తనిఖీ చేసి, హాల్‌టికెట్లను పరిశీలించి, కేటాయించిన గదుల్లోకి అనుమతించారు. పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, విశ్వేశ్వరయ్య పాఠశాల కేంద్రాలను అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో తొలిరోజు పరీక్ష సాఫీగా కొనసాగిందని అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో హాజరు కావాల్సిన, గైర్హాజరైన విద్యార్థులు

జిల్లా	మొత్తం విద్యార్థులు	హాజరైన వారు	గైర్హాజరు
మహబూబ్‌నగర్	12,738	12,689	49
నాగర్‌కర్నూల్	10,532	10,513	19
వనపర్తి	6,905	6,885	20
నారాయణపేట	7,678	7,653	25
జోగులాంబ గద్వాల	7,302	7,179	33





గుండె పోటుతో ట్యాంకర్ డ్రైవర్ మృతి

» బాధితుని కుటుంబాన్ని ఆదుకోవాలని డ్రైవర్ల అసోసియేషన్ డిమాండ్

కీసర రూరల్, మార్చి 18 : విధి నిర్వహణలో ఉండగా గుండె పోటుతో మృతి చెందిన డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి(50) కుటుంబాన్ని ఆదుకోవాలని డ్రైవర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి నగరంలోని కాటేదాన్‌లో నివసిస్తున్నాడు. హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో ట్యాంకర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా ఆదివారం నాగారం మునిసిపల్ పరిధి ఎస్వీనగర్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంకుకు ట్యాంకర్ ద్వారా డీజిల్‌ను తీసుకువచ్చారు. ట్యాంకర్‌ను ఖాళీ చేస్తూ ట్యాంకర్ పక్కనే కూర్చుని సెల్‌ఫోన్‌ను చూస్తున్నాడు. హఠాత్తుగా గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, పెట్రోల్ బంకు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందాడని ఆరోపిస్తూ బంకు వద్ద కాసేపు ఆందోళనకు దిగారు. అనంతరం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రంజిత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డిలపై ఈడీకి ఫిర్యాదు

» బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డిల అక్రమ వ్యాపారాలపై ఈడీకి ఫిర్యాదు చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు తెలిపారు. షేక్‌పేటలోని సర్వేనెంబరు 343, 403లో జరుగుతున్న నిర్మాణ కంపెనీల భూబాగోతం, అడ్డగోలు దందాలపై, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై , అక్రమ నిర్మాణాలపై ఈడీ, ఐటీకి రాతపూర్వకంగా తెలియజేస్తామని చెప్పారు. జితేందర్, రంజిత్‌రెడ్డిలు పార్టీ మారడం వెనుక కొన్ని నిర్మాణ కంపెనీల ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు. త్వరలోనే ఈ వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు. సోమవారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. పదవుల కోసం జితేందర్ పార్టీ మారితే తమకేమీ ఇబ్బంది లేదన్నారు. కానీ, బీజేపీకి సిద్ధాంతం లేదంటూ విమర్శించడం శోచనీయమన్నారు. ఏ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలతో పాటు ఏ నిర్మాణ కంపెనీలో మీ బంధువుల ప్రయోజనాలు ఆశించి కాంగ్రెస్‌లో చేరారో సమాధానం చెప్పా లని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్నికల్లో మీ కుమారుడికి బీజేపి టిక్కెట్టు ఇస్తే కాంగ్రెస్‌కోసం పనిచేశారా? మీ కుమారుడి కోసం పని చేశారా? అని నిలదీశారు. బీజేపీ సిద్ధాంతం ఉన్న పార్టీ అని ప్రకటించి, లుచ్చా గాళ్లు బయటకు వెళతారంటూ జితేందర్, మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా చేసిన ప్రచార క్లిప్పింగ్‌ను రఘునందన్ సమావేశంలో ప్రదర్శించారు. చేవెళ్ల ఎంపీ తో ఉన్న వ్యాపార లావాదేవీలు మాటేంటి? మల్కాజ్‌గిరి, చేవెళ్ల, మెదక్ పార్లమెంటు సెగ్మెంట్లకు ఎంత ఖర్చుచేస్తామని కాంగ్రెస్‌కు మాటిచ్చింద్రు? అని ప్రశ్నించారు. ఈ నియోజకవర్గాల్లో రూ. 500కోట్లు ఖర్చుచేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారో రేవంత్ కూడా అదే తప్పు చేశారని రఘునందన్ తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్‌లలో డబ్బులు పోగొట్టుకొని..

అప్పులపాలై వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, మార్చి 18 : ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి, డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శివానంద్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన గోకం జానర్దన్, గోకం జ్యోతి భార్యాభర్తలు. వీరు గడిచిన ఐదు సంవత్సరాలుగా పోలేపల్లిలో కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్నారు. పోలేపల్లి సెజ్‌లోని హెటిరో పరిశ్రమలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా గోకం జనార్దన్ పనిచేసేవాడు. కాగా, అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి, డబ్బులు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై ఇంట్లో ఇనుప పైపునకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోకం జనార్దన్ భార్య గోకం జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శివానంద్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహమ్మదాబాద్, మార్చి 18 : తమ్ముడు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అన్న మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం పెద్దతండాకు చెందిన కాట్రావత్ లింగ్యా, కాట్రావత్ రాములు అన్నదమ్ములు. వీరికి పొలంలో ఉన్న బోరుబావి విషయంలో గత కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. ఈనెల 12న సాయంత్రం అన్న కాట్రావత్ లింగ్యా పొలం వద్ద ఉండగా తమ్ముడు కాట్రావత్ రాములు అతని వద్దకు వెళ్లి పారతో దాడి చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన లింగ్యా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 15న మృతి చెందాడు. లింగ్యా బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉండవల్లి, మార్చి 18 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో సోమవారం తెల్లవారుజామున బ్లూకోర్ట్ పోలీసులు నిర్వహించిన తనిఖీలో రేషన్ బియ్యం పట్టుబడింది. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం. మహమ్మద్ రఫీ అనే వ్యక్తికి చెందిన ఓమ్నీ వాహనంలో డ్రైవర్ అబ్దుల్ నజీర్ తెలంగాణ ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. బియ్యాన్ని కర్నూలు జిల్లాలో ఎక్కువ ధరకు విక్రయించడానికి వెళ్తుండగా అలంపూర్ చౌరస్తాలో బ్లూకోర్ట్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం ఐదు క్వింటాళ్లు ఉన్నాయని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీకి సమాచారం అందించినట్లు హెచ్‌సీ తెలిపారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓమ్నీ వాహన యజమాని, డ్రైవర్ ఇద్దరిపై ఎస్సై శ్రీనివాసులునాయక్ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

దుకాణాల్లో చోరీ

వడ్డేపల్లి, మార్చి 18 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ పట్టణ పరిధిలోని పైపాడు గ్రామానికి వెళ్లే దారిలో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న రెండు దుకాణాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పైపాడు మల్లికార్జున్‌కు చెందిన జిలేబీ దుకాణంలో జిలేబీ తయారీకి ఉపయోగించే సామగ్రితో పాటు, పిండి సంచులు, చక్కెర, మైదా సంచులు, నూనె డబ్బాలను దొంగలు అపహరించుకొని పోయారని బాధితుడు తెలిపారు. అలాగే సమీపంలో ఉన్న ఏసుకు చెందిన కిరాణం డబ్బాలో కూడా చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. కాగా, వారం క్రితం శాంతినగర్‌లోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరగగా బంగారం, వెండి, నగదు అపహరణకు గురైన విషయం తెలిసిందే. పోలీసులు గస్తీ పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.














పుల్లూరులో చోరీ

» దొంగను పట్టుకొని పోలీసులకు అప్పజెప్పిన స్థానికులు

ఉండవల్లి, మార్చి 18 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ఒక ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు.

హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి ఈశ్వరమ్మ ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో తమ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి ఇంటికి తాళం వేసి మిద్దెపై నిద్రించారు. చిన్న కుమారుడు పురుషోత్తం అర్ధరాత్రి 12 దాటిన తర్వాత మూత్రానికి మిద్దెపై నుంచి కిందికి దిగి వస్తుండగా ఓ దొంగ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న కొంత నగదు తీసుకుని పారిపోతుండగా గుర్తించి కేకలు వేశాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, స్థానికులు దొంగను పట్టుకున్నారు. అతని నుంచి దొంగిలించిన రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి దొంగను అదుపులోకి తీసుకుని విచారించగా కర్నూలు పట్టణానికి చెందిన తెలుగు రాజుగా గుర్తించినట్లు తెలిపారు. ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాసులునాయక్ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్ల విస్తరణ జరిగేనా.?!

» అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు
» నిధుల విడుదలలో జాప్యం
» నిర్లక్ష్యం వహిస్తున్న గుత్తేదారులు
» తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న వాహనదారులు

ఆత్మకూరు, మార్చి 18 : ఆత్మకూరు పట్టణంలోని రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడమే కాకుండా సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ట్రాఫిక్ ఆంక్షలు ఏర్పడి ఆలస్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని.. రోడ్డు విస్తరణ జరిగితే ఆత్మకూరు అభివృద్ధి చెందడమే కాకుండా వ్యాపారాలు కూడా సవ్యంగా జరుగుతాయనే సదుద్దేశంతో రోడ్డుకిరువైపులా ఉన్న వ్యాపార యజమానులు, కుటుంబాలు విస్తరణ చేపట్టేందుకు సహకరించాయి. అందులో భాగంగానే మునిసిపల్ పాలక మండలి రోడ్డు విస్తరణ పనులు చేపట్టింది. గాంధీచౌరస్తా నుంచి చెన్నకేశవస్వామి ఆలయం వరకు విస్తరణ పనులు చేపట్టారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండున్నర కోట్ల రూపాయలను వెచ్చించి విస్తరణ పనులు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులను ప్రారంభించినా ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో ఆత్మకూరు నుంచి కొత్తకోట, పాలమూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోక తప్పడం లేదు.

అధ్వానంగా కొత్తకోటకు వెళ్లే రోడ్డు

ఆత్మకూరు నుంచి కొత్తకోటకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. పట్టణం నుంచి కొత్తకోటకు భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. పట్టణంలో రోడ్డు విస్తరణ చేపడితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని ఆర్ అండ్ బీ శాఖ రూ.ఐదు కోట్ల 12 లక్షలు నిధులు సమకూర్చింది. పట్టణంలోని పరమేశ్వర స్వామి చెరువు ప్రాంతం నుంచి 2.4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు, అలాగే చేపల మార్కెట్ నుంచి ఫోర్ లైన్ సీసీ రోడ్డు 400 మీటర్లకు గాను టెండర్లు పిలిచి గత అసెంబ్లీ ఎన్నికల ముందు అక్టోబర్ నెలలో పనులు ప్రారంభించారు. అయితే ఒకవైపు మాత్రమే సీసీ పూర్తిచేసి మరోవైపు ప్రారంభించకపోవడంతో అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఒకవైపు పూర్తిచేసి మరొకవైపు పూర్తి చేయకపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గాంధీ చౌరస్తా నుంచి కొత్తకోటకు వెళ్లే మార్గంలో ఒకే వైపు వేసిన రోడ్డు


ఆత్మకూరు పట్టణ శివారులో నిలిచిన చెరుకు ట్రాక్టర్లు

ట్రాఫిక్ తగ్గే వరకు నిలిచిపోవాల్సిందే..

ఆత్మకూరు, అమరచింత, నర్వ మండలాల్లో రైతులు అత్యధికంగా చెరుకు పంటను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆత్మకూరు పట్టణం మీదుగా కొత్తకోట మండలంలో ఉన్న కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు ట్రాక్టర్లు అత్యధికంగా రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ప్రస్తుతం రోడ్ల విస్తరణ పూర్తి కాకపోవడంతో ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలులేని కారణంగా ట్రాఫిక్ పూర్తయ్యే వరకు చెరుకు ట్రాక్టర్లు పట్టణంలోకి ప్రవేశించకుండా ఆరుబయటే నిలుపుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. దీనిద్వారా మధ్యాహ్నం చెరుకు పంటతో వచ్చిన వాహనం రాత్రి తొమ్మిది గంటల వరకు నిలిచిపోతే టన్నేజీ తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పట్టణ ప్రజలతో పాటు, ఆయా గ్రామాల వాహనదారులు, చెరుకు రైతులు కోరుతున్నారు.

తక్షణమే విస్తరణ పనులు చేపట్టాలి



ఆత్మకూరు పట్టణంలో చేపట్టిన ప్రధాన రహదారులు నత్తనడకన సాగుతున్నాయి. ఒక అడుగు ముందుకు వేస్తే రెండు అడుగులు వెనకకు వేసే పరిస్థితి నెలకొంది. దీని ద్వారా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిధుల నిర్లక్ష్యం కారణంగానే జాప్యం జరుగుతోందని అధికారులు అంటున్నారు. తక్షణమే నిధులు విడుదల చేసి అసంపూర్తిగా నిలిచిన రోడ్ల మరమ్మతులను పూర్తి చేయాలి.

- అశ్వినికుమార్, బీజేపీ నాయకుడు

చెరుకు రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు



గ్రామాల నుంచి చెరుకు లోడ్లతో వస్తున్న ట్రాక్టర్లు పట్టణం మీదుగా కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లాలంటే రాత్రి తొమ్మిది గంటల వరకు వేచి చూసే పరిస్థితి దాపురించింది. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉండడంతో దాటి వెళ్లాలంటే గండంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు చేపడితే రైతులకు సౌకర్యంగా ఉంటుందని ఇదివరకు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. తక్షణమే విస్తరణ పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

- రాజన్న
చెరుకు రైతుల సంఘం
ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

పునరావాస ప్యాకేజీ ప్రగతిపై చర్చ

» డీఎఫ్‌వోతో మాట్లాడిన సార్లపల్లి గ్రామస్థులు
» బాచారంలో జరుగుతున్న ఏర్పాట్లను వివరించిన రోహిత్‌గోపిడీ

మన్ననూర్, మార్చి 18 : నల్లమల అడవులను వీడి మైదాన ప్రాంతాలకు తరలిపోతున్న అమ్రాబాద్ మండలం సార్లపల్లి పునరావాస కమిటీ సభ్యులు మన్ననూరులోని అటవీ డివిజన్ కార్యాలయంలో డీఎఫ్‌వో రోహిత్‌గోపిడిని సోమవారం కలిసి ప్యాకేజీ ప్రగతిపై చర్చించారు. మొత్తం 185 కుటుంబాలకు పునరావాస ప్యాకేజీ కింద గుర్తించారు. వీరందరికీ నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం సామాజిక అడవుల్లో వ్యవసాయ భూములు, పక్కాగృహాలు, మౌలిక వసతులు కల్పించనున్నారు. ఈ విషయమై డీఎఫ్‌వో పునరావాస కమిటీ సభ్యులతో బాచారంలో జరుగుతున్న ఏర్పాట్లను వివరించారు. అటవీ భూమిని రెవెన్యూ భూమిగా మార్చేందుకు సంబంధించిన ఫైల్‌ను ఢిల్లీకి పంపించామన్నారు. రెండు రోజుల్లో బాచారంలో రోడ్లు వేసే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులకు వివరించారు. పునరావాస ప్యాకేజీకి సంబంధించించి అటవీశాఖ ద్వారా రూ.52 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో 220 గజాలు కేటాయిస్తుండగా, తమకు పశువులు, మేకలు కట్టేసుకునేందుకు మరో 30 గజాలు కలిపి 250 గజాలు వచ్చేలా చూడాలని కమిటీ సభ్యులు డీఎఫ్‌వోకు విన్నవించగా, పరిశీలిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పునరావాస కమిటీ అధ్యక్షుడు పుణ్యమూర్తి విష్ణు, కమిటీ సభ్యులు సంతోష్, నారాయణ, వెంకటేష్, రమేష్ తదితరులున్నారు.


మన్ననూరు డివిజన్ కార్యాలయంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడితో చర్చిస్తున్న సార్లపల్లి గ్రామస్థులు

విద్యార్థుల పోరాట ఫలితమే

పీయూలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు

» పీయూ విద్యార్థి జేఏసీ నాయకుడు బత్తిని రాము

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 18 : పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు అవుతున్నాయంటే అది విద్యార్థుల పోరాట ఫలితమేనని పీయూ విద్యార్థి జేఏసీ నాయకుడు బత్తిని రాము తెలిపారు. సోమవారం పీయూ పీజీ సెంటర్‌లో విద్యార్థి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాము మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పేద విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుతున్నారని, పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక ప్రకారం ఉద్యమించామని అన్నారు. తమ పోరాట ఫలితమే పీయూలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. సమావేశంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

» హన్వాడలో మోటార్‌సైకిల్ ఢీకొని ఒకరు..
» కృష్ణలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొని మరొకరు..
» పెద్దగూడెం శివారులో బైక్ అదుపు తప్పి యువకుడు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..

మోటార్‌సైకిల్ ఢీకొని..


సత్తయ్య (ఫైల్)

హన్వాడ, మార్చి 18 : మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాయినోనిపల్లి గ్రామానికి చెందిన చెంచు సత్తయ్య(50) సోమవారం హన్వాడలో చెత్త సామాను అమ్మి తిరిగి గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నాడు. మండల కేంద్ర సమీపంలోని చంద్రాయునిగుట్ట వద్ద హన్వాడ నుంచి నాయినోనిపల్లికి వస్తున్న మోటార్‌సైకిల్ సత్తయ్యను వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో సత్తయ్య కాలు విరిగి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మోటార్‌సైకిల్ నడిపిన వ్యక్తి చెన్నయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి సోదరుడు తిరుమలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొని మరొకరు..

కృష్ణ : ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్ర శివారులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తంగడిగి గ్రామానికి చెందిన ఆలంపల్లి ఆంజనేయులు(42) గూడెబల్లూరు గ్రామంలో వివాహానికి హాజరై బైక్ మీద తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. కృష్ణ గ్రామ శివారులోని దయ్యంమోరి వద్ద అర్ధరాత్రి సమయంలో ఎదురుగా నేరేడుగం గ్రామానికి చెందిన గుంట గణేష్ అనే వ్యక్తి అజాగ్రత్తగా బైక్ నడుపుకుంటూ వచ్చి ఆంజనేయులు బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో ఆంజనేయులు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారులు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కుటుంబీకులకు సమాచారమందించినట్లు పోలీసులు వివరించారు. మృతుడి భార్య పద్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


ఆంజనేయులు (ఫైల్)

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని పెద్దగూడెం గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం మిరాసిపల్లి గ్రామానికి చెందిన దినేష్(29), మహేష్(22)లు కలిసి పెబ్బేరులో ఒక ఫంక్షన్‌కు బైక్‌పై వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పెద్దగూడెం గ్రామ శివారులోని డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద టూవీలర్ వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. ప్రమాదంలో దినేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో వారిని ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

నవాబ్‌పేట : బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్ర సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్వాడ మండలం గుడిమల్కాపూర్ గ్రామానికి చెందిన కేశవులు అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై నవాబ్‌పేట నుంచి కొందుర్గు వైపు వెళ్తుండగా నవాబ్‌పేట శివారు గడ్డమీదమర్రి వద్ద తాను నడుపుతున్న బైక్ అదుపు తప్పి పక్కకు దూసుకుపోయింది. దీంతో కేశవులుకు గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం అతన్ని 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మానవపాడు శివారులో విద్యార్థులకు..


ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి ప్రవీణ్

మానవపాడు : పదవ తరగతి పరీక్ష రాసేందుకోసం బైక్‌పై కేంద్రానికి వస్తున్న విద్యార్థులకు వాహనం అదుపు తప్పి గాయాలైన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్ర సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని చిన్నపోతులపాడు గ్రామానికి చెందిన ప్రవీణ్, మధు అనే ఇద్దరు విద్యార్థులు బైక్‌పై సోమవారం ఉదయం మానవపాడుకు బయలుదేరారు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని మానవపాడు పీహెచ్‌సీకి తరలించారు. విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో పరీక్షకు హాజరు కాలేకపోయారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రామం నుంచి ప్రత్యేక వాహనాలను నడిపించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

తల్లిదండ్రులు మందలించారని

యువకుడి ఆత్మహత్య

తెలకపల్లి, మార్చి 18 : తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం ఆలేరు గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వెల్లె బాలయ్య కుమారుడు రాములు(24) పనీపాట లేకుండా తిరుగుతున్నాడు. జులాయిగా తిరుగుతున్నావని పదిరోజుల క్రితం తల్లిదండ్రులు మందలించారు. ఈనెల 15న సాయంత్రం రాములు ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఆలేరు శివారులోని కోళ్ల బండ వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు గమనించి యువకుడి కుటుంబీకులకు సమాచారమందించారు. సోమవారం యువకుడి కుటుంబీకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పురుగుల మందు తాగి

యువకుడి ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

తెలకపల్లి, మార్చి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గట్టునెల్లికుదురు గ్రామానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విష్ణు, పిట్టల యాదయ్య కుటుంబాల మధ్య పొలానికి వెళ్లే బాట విషయంలో ఆదివారం గొడవ జరిగింది. గొడవ అనంతరం యాదయ్య కుటుంబానికి చెందిన పిట్టల ఆంజనేయులు విష్ణుకు ఫోన్ చేసి నీ కుమారుడు ప్రశాంత్(18) గొడవల్లోకి వచ్చి మమ్మల్ని కొట్టాడు.. రేపు ఉదయం అతని సంగతి చూస్తామని బెదిరించారు. భయపడిన ప్రశాంత్ ఆదివారం సాయంత్రం పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు

» ఎస్పీ రితిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

మానవపాడు, మార్చి 18 : శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ రితిరాజ్ అన్నారు. మండలంలోని పల్లెపాడు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.3.50 లక్షల విలువైన 12 సీసీ కెమెరాలను సోమవారం ఆమె ప్రారంభించారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసులకు సహకరించాలని గ్రామస్థులను కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటు సంతోషకరమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ముందుంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. దొంగతనాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ఫుటేజీ సాయంతో కేసులను త్వరగా ఛేదించొచ్చన్నారు. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, ఎస్ఐలు స్వాతి, ఎస్ఐ వెంకటేష్, రైతుసంఘం అధ్యక్షుడు సత్యారెడ్డి, సభ్యులు శంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భద్రత, భరోసా కోసం ఫ్లాగ్‌మార్చ్

» గద్వాల పట్టణ ఎస్ఐ శ్రీనివాస్



గద్వాల పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

గద్వాల క్రైం, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు భద్రత, బరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాల ఆధ్వర్యంలో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌక్, కృష్ణవేణి చౌక్, కొత్తబస్టాండ్, నల్లకుంట, పాతబస్టాండ్, గాంధీచౌక్, రాజవీధి, మోమిన్ మొహల్లా, రాఘవేంద్రకాలనీల మీదుగా కవాతు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లో కవాతు నిర్వహిస్తామని తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

» అయిజ ఎంపీడీవో వెంకటయ్య

అయిజ, మార్చి 18 : మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రహ్లాదరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు హాజరయ్యారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

» ఆహ్వానించిన జడ్పీ చైర్‌పర్సన్ సరిత



పార్టీలో చేరిన నాయకులతో జడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల, మార్చి 18 : మండల పరిధిలోని సంగాల గ్రామానికి చెందిన బీఆర్‌యస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జడ్పీ చైర్‌పర్సన్ సరిత వారికి కాంగ్రెస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, నర్సింహులు, మద్దిలేటితో పాటు మరికొందరు పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలన, అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ గౌడ్, బీరోలు రవీందర్‌రెడ్డి, రాముడు తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ, మార్చి 18 : ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. అయిజ మండల పరిధిలోని టీటీదొడ్డి, కుట్కనూర్, సిందనూర్, భూంపూర్ గ్రామాల్లో సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బలిగెర శివారెడ్డి, భీమ్‌సేన్‌రావు, వెంకటేష్, సురేష్, సంజీవరెడ్డి, లక్ష్మణ్‌గౌడు, భగత్‌రెడ్డి, భీముడు పాల్గొన్నారు.

'ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

గద్వాల న్యూటౌన్, మార్చి 18 : వాల్మీకి బోయలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు సోమవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు రంగస్వామి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం అన్ని కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, కానీ వాల్మీకి బోయలను విస్మరించిందన్నారు. వాల్మీకి బోయలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. కార్య క్రమంలో మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు, కవి అవనిశ్రీ పాల్గొన్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ : జడ్పీ సీఈవో



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఉమాదేవి

మానవపాడు, మార్చి 18 : రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జడ్పీ సీఈవో ఉమాదేవి అన్నారు. మండల కార్యాలయంలో వివిధ పనులకు సంబంధించిన రికార్డులను సోమవారం ఆమె పరిశీలించారు. రికార్డుల్లో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, ఏమైనా పొరపాట్లు జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఆమె వెంట సీఈవో కార్యాలయ సిబ్బంది రవికుమార్, నాగరాజు, ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

తొలిరోజు ప్రశాంతం

» జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

» తనిఖీ చేసిన విద్యాశాఖ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ » కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



మానవపాడు పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేసి పంపిస్తున్న అధికారులు

ధరూరు, మార్చి 18 : జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా కొనసాగాయి. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ధరూరు మండల కేంద్రంలో 265 మంది విద్యార్థులకు గాను, 265 మంది హాజరయ్యారు. ఉప్పేరు కేంద్రంలో 172 మందికి, 171 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. మార్లబీడు పాఠశాలలో 178 మంది విద్యార్థులకు, 177 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో సురేష్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వడ్డేపల్లి : మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 260 మంది విద్యార్థులకు గాను 257 మంది పరీక్షకు హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. రవీంద్ర ఉన్నత పాఠశాల కేంద్రంలో 158 మందికి గాను, 157 మంది పరీక్ష రాయగా, ఒకరు గైర్హాజరయ్యారు. రాఘవేంద్ర ఉన్నత పాఠశాలలో 259 మందికి గాను, అందరూ హాజరయ్యారని ఎంఈవో నరసింహ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మానవపాడు : మానవపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 283 మందికిగాను ఇద్దరు గైర్హాజరు కాగా, 281మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో శివప్రసాద్ తెలిపారు.

ఇటిక్యాల : మండల పరిధిలోని ఇటిక్యాల జడ్పీహెచ్ఎస్‌లో 199 మందికి గాను ఒకరు గైర్హాజరు కాగా, 198 మంది పరీక్ష రాశారు. ఎర్రవల్లి జడ్పీ హైస్కూల్‌లో 122 మందికి గాను ఒకరు పరీక్ష రాయలేదని, 121 మంది హాజరయ్యారు. మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో 616 మందికి గాను 614 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇటిక్యాల పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ నరేందర్ తనిఖీ చేశారు. ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అలంపూర్ : అలంపూర్ పట్టణంలోని హరిజనవాడ జడ్పీహెచ్ఎస్‌లో 170 మంది, న్యూప్లాట్స్ జడ్పీహెచ్ఎస్‌లో 141 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో అశోక్‌కుమార్ తెలిపారు. ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉండవల్లి : ఉండవల్లి మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు ముఖ్య నిర్వాహణ అధికారులు అమరేందర్ రెడ్డి, నిర్మలాజ్యోతి, శ్రీనివాసులు తెలిపారు. జడ్పీహెచ్ఎస్‌లో 137, మైనారిటీ గురుకుల పాఠశాలలో 150 విద్యార్థులు పరీక్షలు రాయగా, ప్రాథమిక పాఠశాలలో 132 విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరు అయినట్లు పరీక్ష కేంద్ర నిర్వాహణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ ఈ.రాజు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు నాయక్ తెలిపారు.

రాజోలి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చీఫ్ సూపరిడెంట్ రాజేశ్వర్ రెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సాయి ప్రకాష్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 104 మందికి గాను, 102 మంది పరీక్ష రాశారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ జగదీశ్వర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అయిజ : అయిజ మండల పరిధిలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 986 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 975 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



ఉండవల్లిలోని పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



రాజోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



ధరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి పంపిస్తున్న అధికారులు

ఎన్నికల నియమావళిని పాటించాలి

» సమావేశాలకు సువిధ యాప్‌లో అనుమతులు » కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, హాజరైన అధికారులు

గద్వాల న్యూటౌన్, మార్చి 18 : ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని, ప్రవర్తనా నియమావళిని ప్రతీ ఒక్కరు పాటించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను వివరించారు. ఈ నెల 16న షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. సమావేశాల నిర్వహణకు రాజకీయ పార్టీలు సువిధ పోర్టల్ ద్వారా అనుమతులు పొందొచ్చని తెలిపారు. పత్రికలలో ప్రకటనల కోసం ఎంసీఎంసీ ద్వారా అనుమతులు పొందాలన్నారు. ప్రవర్తనా నియమావళి అతిక్రమణలపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశానికి అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఏప్రిల్ రెండు వరకు వార్షిక పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 41 పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు 7,212 మందికి గాను 7,179 మంది హాజరయ్యారని తెలిపారు. 33 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్క విద్యార్థినీ తనిఖీ చేసిన తర్వాత లోనికి పంపించాలన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించొద్దని అధికారులకు సూచించారు.

రైల్వే స్టేషన్‌లో మజ్జిగ పంపిణీ కేంద్రం

గద్వాల అర్బన్, మార్చి 18 : జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో సోమవారం మద్రాస్‌పేటకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు వీరేష్ ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ ఆటో యూనియర్ లీడర్ చిన్న, ఆంజనేయులు, బాషా, బాలకృష్ణ, శేఖర్, రాజు, మద్దిలేటి పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

వడ్డేపల్లి/ గట్టు మార్చి 18 : వ్యాధులు సోకకుండా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ పుష్పలత రైతులకు సూచించారు. మండల పరిధి లోని కోయిలదిన్నె గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన శిబిరంలో 25 మంది రైతులకు చెందిన 196 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి వరప్రసాద్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ లతీఫ్, ఓఎస్ రవికిరణ్, గోపాలమిత్ర లక్ష్మన్న పాల్గొన్నారు. గట్టు మండల పరిధిలోని తప్పెట్లమొర్సు, మిట్టదొడ్డి గ్రామాల్లో 53 మంది రైతులకు చెందిన 192 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కనకరాజు, పృథ్వీరాజ్, గోపాలమిత్రలు పరమేష్ నాయుడు, ఉరుకుందు, శివశంకర్‌గౌడు, గంగాధర్‌గౌడు, రామాంజనేయులు, మహేశ్ పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం కమిటీ ఎన్నిక

మల్దకల్, మార్చి 18 : మండలంలోని తాటికుంట రిజర్వాయర్ మత్స్య సహకార సంఘం కమిటీను ఆ సంఘం యువజన అధ్యక్షుడు తెలుగు పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తప్పెట్లమొర్సు గ్రామానికి చెందిన వాకిటి జయరాములును అధ్యక్షుడిగా, జామకాయల హనుమంతు, మల్దకల్‌కు చెందిన దేవన్నలను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం జిల్లా డైరెక్టర్ రామచంద్ర, గట్టు మండల అధ్యక్షుడు వెంకటేష్, రాజేష్, ఎన్నికల అధికారి యాదగిరి పాల్గొన్నారు.

రామేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రాజోలి, మార్చి 18 : మండల కేంద్రమైన రాజోలి శివారులోని తుంగభద్ర నది మధ్యలో వెలసిన రామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆడివిస్వామి, భక్తులు నీలకంఠం, వినయ్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడి అమానుషం

ధరూరు, మార్చి 18 : ప్రభుత్వ ఉద్యోగి పై దాడి అమానుషమని ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. కోడేరు మండలం ఎంపీవోపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం ధరూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీరాజ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు.

అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ఆసుపత్రికి పంపించాలి

» వైద్యులు శ్యామ్, అశోక్ » శిశు మరణాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్యామ్

గద్వాల న్యూటౌన్, మార్చి 18 : అత్యవసర పరిస్థితిలో ఉన్న గర్భిణులను తప్పనిసరిగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పంపించాలని, నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించేలా చూడాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి చిన్న పిల్లల వైద్యులు శ్యామ్, అశోక్ అన్నారు. శిశు మరణాలపై జిల్లా కేంద్రంలోని పాత డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్ మాట్లాడుతూ గర్భిణులకు రక్తహీనత ఉండటం, ప్రసవానికి ముందు, తర్వాత జ్వరం రావడం, ప్రసవానికి ముందు, తర్వాత నెల వరకు అధిక రక్తస్రావం కావడం, మూర్ఛ, తలనొప్పి, వాంతులు, చాతిలో నొప్పి, కాళ్లవాపులు ఉంటే కాన్పు కష్టమై శిశు మరణాలకు దారి తీసే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి ఆలాంటి వారికి ప్రతీ కాన్పు ప్రభుత్వ ఆసుపత్రిలో అయ్యేట్లు చూడాలన్నారు. అలాగే బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని, శిశువును వెచ్చగా ఉంచాలని, బొడ్డు తాడును పొడిగా ఉంచాలని, దానికి ఏమీ రాయకూడదని సూచించారు. అనారోగ్యంగా ఉన్నవారి నుంచి శిశువును దూరంగా ఉంచాలని, శిశువు బరువు 2.5 కిలోగ్రాములకన్నా తక్కువ ఉంటే ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గృహ సందర్శన సమయంలో శిశువు పాటు సరిగా తాగుతున్నాడా లేదా గమనించాలని ఆరోగ్య, ఆశ కార్యకర్తలను ఆదేశించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. పక్కటెముకలు ఎగురవేయడం, తీవ్రమైన దగ్గు, జ్వరం ఉంటే వెంటనే శిశువును ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప, మాతాశిశు ప్రోగ్రాం అధికారి డాక్టర్ స్రవంతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, తిరుమల్ రెడ్డి, వరలక్ష్మి, ప్రమోద, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోట్ల రూపాయల ఆదాయం..

అభివృద్ధి శూన్యం

» వ్యవసాయ మార్కెట్‌లో సమస్యల తిష్ట » జీరో దందాతో ఆదాయానికి గండి

» రూ. 3.89 కోట్ల పనులకు ప్రతిపాదనలు » రద్దయిన పాలకవర్గం



గద్వాల వ్యవసాయ మార్కెట్ కార్యాలయం



షెడ్ల కింద సేద తీరుతున్న రైతులు (ఫైల్)

గద్వాల, మార్చి 18 : గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు ఒకప్పుడు ప్రత్యేక స్థానం ఉండేది. అన్ని ప్రాంతాల రైతుల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు నెలవుగా ఉండేది. ఉమ్మడి జిల్లాలోనే నెంబర్ వన్ స్థానంలో ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. అభివృద్ధి పనులు చేపట్టకపోవడం, రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించకపోవడం, అకాల వర్షాలు వచ్చినప్పుడు ధాన్యం కొట్టుకుపోవటం తదితర సమస్యలు మార్కెట్‌ను వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కొనుగోలుదారులకు, రైతులకు మార్కెట్ అధికారులు భరోసా ఇవ్వలేకపోతున్నారు. అన్ని పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే పరిస్థితిని కల్పించలేకపోతున్నారు. ఫలితంగా కొనుగోలుదారులు తగ్గిపోవడం, రైతులకు గిట్టుబాటు ధరలు అందకపోవడంతో ఇతర ప్రాంతాలకు పంట ఉత్పత్తులను తీసుకెళ్తుండటంతో మార్కెట్ కళ తప్పుతున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే మార్కెట్ ఫీజును మినహాయిస్తే, నేరుగా మార్కెట్‌కు వచ్చే ఆదాయం నిర్వాహణ, జీతభత్యాలకే సరిపోయే పరిస్థితి ఉంది. దానికి తోడు జీరోదందాను నిలువరించకపోవడంతో ఆదాయంపై ప్రభావం పడ్తోంది.

ఈ ఏడాది ఆదాయం రూ. 4.47 కోట్లు

వ్యవసాయ మార్కెట్‌కు నేరుగా వచ్చిన పంట ఉత్పత్తులను కమీషన్ మర్చంట్ల ద్వారా విక్రయించడంతో వచ్చే మార్కెట్ ఫీజు ఈ ఏడాది రూ. 2.33 కోట్ల వరకు వచ్చింది. ఇందులో వేరుశనగ విక్రయాల ద్వారానే రూ.1.49 కోట్లు వచ్చాయి. మిగిలింది అన్ని పంట ఉత్పత్తులు విక్రయించడం ద్వార వచ్చినదే ఉంది. ఆదాయం పెరగకపోవడం మార్కెట్ అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ దశలో జీరో దందాను నిలువరిస్తేనే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మార్కెట్‌కు నాలుగు గేట్లు ఉండటం, సీసీ కెమెరాలు లేకపోవడం, నిలువరించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మార్కెట్ ఆదాయంపై ప్రభావం పడుతున్నది. ఇక రెండవది.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన వాటిపై సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చే మార్కెట్ ఫీజు. ఇది ఈ ఏడాది రూ. 1.61 కోట్ల వరకు వచ్చింది. మూడవది చెక్‌పోస్టుల నిర్వహణ ద్వారా రూ.24.16 లక్షలు, డైరెక్టు ఎగుమతులతో రూ.55.65 లక్షల మార్కెట్ ఫీజు వచ్చింది. ఇలా ఈ ఏడాది మొత్తంగా రూ.4.74 కోట్ల వరకు ఆదాయం లభించింది.

మౌలిక సదుపాయాలు కరువు

మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచన పాలక వర్గాలకు ఉంటే జీరోదందాను అరికట్టడంతో ఆదాయాన్ని పెంచి, అభివృద్ధి పథంలోకి నడిపించే అవకాశం ఉంది. గత పదేళ్లుగా పాలకవర్గాలు అధికారం చెలాయించాయి తప్ప, అభివృద్ధిపై దృష్టి సారించలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. రైతులకు సరైన వసతులు లేవు. మంచినీళ్లు, మరుగుదొడ్లు కూడా లేవు. రైతులు సేద తీరే షెడ్లు సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నది. దీంతో రైతులు మార్కెట్ షెడ్లకిందే సేదతీరాల్సి వస్తోంది. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో అకాల వర్షాలు వచ్చినప్పుడు మార్కెట్‌లో ఆరబెట్టుకున్న ధాన్యం కొట్టుకుపోతున్నది. ప్రహరీ అక్కడక్కడ పడిపోవడంతో పందులు, పశువులు వస్తున్నాయి. గేట్లు కూడా దెబ్బతిన్నాయి. విద్యుత్ లైట్లు పూర్తి స్థాయిలో లేక రాత్రిపూట ఇబ్బందులు తప్పడం లేదు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఏదైనా సంఘటన జరిగితే విచారణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలు చాలా ఏళ్లుగా కొనసాగుతున్నా, పాలకవర్గాలు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు.

ప్రారంభం కాని ప్రతిపాదిత పనులు

గత ఏడాది బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం మార్కెట్‌లో సమస్యలను పరిష్కరించడానికి పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేసింది. మొత్తం రూ.3.89 కోట్ల వ్యయంతో మార్కెట్‌లో అన్ని వసతులు కల్పించాలని నిర్ణయించింది. అందుకు అవసరమైన అనుమతులు తెచ్చుకొని టెండర్లు పిలిచింది. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. అలోపే అసెంబ్లీ ఎన్నికలు రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆ తర్వాత పాలకవర్గాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో అనుమతులు పొందిన పనులపై దృష్టి పెట్టేవారు లేక ప్రారంభం కాలేదు. కొత్త పాలకవర్గం వస్తే తప్ప మార్కెట్‌లో అభివృద్ధి పనులు జరిగే అవకాశం లేదు. మార్కెట్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పనులకు టెండర్లు పిలిచాం



మార్కెట్‌లో పలు అభివృద్ధి పనులు చేయడానికి అనుమతులు తీసుకున్నాం. టెండర్లు పిలిచాం.. కానీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు ప్రారంభం కాలేదు. మార్కెట్‌లో జీరో దందాను నిలువరిస్తున్నాం. అదే విధంగా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమంగా రవాణా అవుతున్న సరుకులను పట్టుకొని మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నాం.

– నర్సింహులు, మార్కెట్ కార్యదర్శి, గద్వాల